నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | బుధవారం 5 ఫిబ్రవరి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

దండేపల్లిలో మాట్లాడుతున్న మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

- ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి
- అక్రమ కేసులకు భయపడేది లేదు
- స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరాలి
- మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

దండేపల్లి, ఫిబ్రవరి4: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని, అభివృద్ధిని గాలికి వదిలేసి పగ, ప్రతీకారాలతో పాలన సాగిస్తున్నదని, ఈ మోసకారి సర్కారుకు స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం దండేపల్లి మండల కేంద్రంలోని పద్మశాలీ భవన్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా భయపడేది లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కక్షపూరితంగా వ్యవహరిస్తూ బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నదని మండిపడ్డారు. కార్యకర్తలకు బీఆర్ఎస్ ఎప్పటికీ అండగా ఉంటుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన వారికే ప్రాధాన్యత ఇస్తామన్నారు.ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. కాంగ్రెస్ మోసాలను గడపగడపకూ వివరించి ప్రజలను చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో బీఆర్ఎస్ జెండా ఎగరవేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలో రావడం ఖాయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నడిపెల్లి ట్రస్ట్ చైర్మన్, యువ నాయకులు విజిత్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కాసనగొట్టు లింగన్న, వైస్ చైర్మన్ అక్కల రవి, మాజీ వైస్ ఎంపీపీ అనిల్, బీఆర్ఎస్ నాయకులు గోళ్ల రాజమల్లు, గొట్ల భూమన్న, రేని శ్రీనివాస్, బచ్చల అంజన్న, రాజిరెడ్డి, ఇసాకర్, మల్లయ్య, అఫ్సర్, ఉస్మాన్‌ఖాన్, రవికుమార్, అజయ్, రాకేశ్, సాయి, హరీశ్, పవన్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పెంట రాజయ్య దంపతులను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు

మున్సిపల్ మాజీ చైర్మన్‌కు సన్మానం

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 4 : మంచిర్యాల మున్సిపల్ మాజీ చైర్మన్ పెంట రాజయ్య దంపతులను మంగళవారం బీఆర్ఎస్ నాయకులు, పాతమంచిర్యాల గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఇటీవల పదవీ కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా పాత మంచిర్యాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు ఆయన నివాసానికి వెళ్లి పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎర్రం తిరుపతి, దుర్గం రాజేశ్, వేముల గురువయ్య, వొడ్నాల రవీందర్, పల్లరాజన్న, ధర్ని శ్రీనివాస్, పెంట తిరుపతి, పానగంటి పోచయ్య, శెట్టి శ్రీనివాస్, పెంట ప్రదీప్, రమేశ్‌యాదవ్, బాలచందర్ , ఆంబ్రోస్, గడ్డం అశోక్, నర్సయ్య పాల్గొన్నారు.

జీఐఎస్ ఆధారిత ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, ఫిబ్రవరి 4 : మంచిర్యాల మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా మార్చిన నేపథ్యంలో మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు జీఐఎస్ ఆధారిత ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ శాఖ (హైద్రాబాద్) అదనపు సంచాలకుడు రమేశ్‌బాబు, మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ శివాజీతో కలిసి సంబంధిత అధికారులకు మాస్టర్ ప్లాన్ రూపకల్పనపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ మంచిర్యాల మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా నవీకరిస్తామని, ఈ క్రమంలో డ్రోన్ సర్వే ద్వారా సంబంధిత వివరాలు సేకరించామని తెలిపారు. కార్పొరేషన్ రూపకల్పనతో పాటు నివాస ప్రాంతాలు, పారిశ్రామికంగా అభివృద్ధి చెందే ప్రాంతాలను గుర్తించాల్సి ఉంటుందని, ఆయా ప్రాంతాల్లో వివిధ అంశాలకు సంబంధించిన వివరాలను సేకరిస్తామన్నారు. స్టడీ మ్యాప్స్ తయారు చేసి, ముసాయిదా మాస్టర్ ప్లాన్ రూపొందించి ప్రభుత్వ ఆమోదం కోసం ప్రతిపాదిస్తామని పేర్కొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

పీవోఎస్ పరికరాలు అందజేత

నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో కలెక్టర్ కుమార్ దీపక్ వీవోఏ, ఆర్‌పీ, గ్రామ సంఘాలకు పీవోఎస్ పరికరాలు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పీవోఎస్ పరికరాలతో స్త్రీనిధి పథకం కింద రుణాల మంజూరు, వసూలు ప్రక్రియ సులభతరంగా ఉంటుందని తెలిపారు. దీనిపై ఒక్కరోజు శిక్షణ కూడా నిర్వహించినట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ శివాజీ, మెప్మా పీడీ మారుతి, డీఆర్‌డీవో కిషన్, స్త్రీనిధి జోనల్ మేనేజర్ రవికుమార్, రీజనల్ మేనేజర్ వెంకటరమణ, టీఎంసీలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు ధరావత్ మంగీలాల్

మారుపేర్ల డిపెండెంట్‌ల పోరాటానికి మద్దతు

టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు ధరావత్ మంగీలాల్

రెబ్బెన, ఫిబ్రవరి 4 : సింగరేణిలో మారుపేర్ల కార్మికుల డిపెండెంట్‌లు చేస్తున్న పోరాటానికి తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు ఆ సంఘం కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు ధరావత్ మంగీలాల్ పేర్కొన్నారు. మంగళవారం బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి టీబీజీకేఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాత పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యలను కేసీఆర్ సర్కారు, టీబీజీకేఎస్ పరిష్కరించిందని గుర్తు చేశారు. జాతీయ సంఘాలు 1998లో పోగొట్టిన డిపెండెంట్ ఉద్యోగాలను తిరిగి తీసుకువచ్చిన ఘనత కేసీఆర్‌దేనని కొనియాడారు. గతంలో కార్మికులకు అవగాహన లేక మారు పేర్లపై ఉద్యోగంలో చేరారని, వారిని ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. రాజ్యాంగంలో గెజిట్ ద్వారా పేరు మార్పు చేసుకునే అవకాశం ఉందన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. గతంలో పేరు మార్పు చేసి ఉద్యోగం ఇవ్వాలని టీబీజీకేఎస్ యాజమాన్యాన్ని కోరిందని, కానీ అంతలోనే ఎన్నికలు రావడంతో ఆ సర్క్యులర్‌కు బ్రేక్ పడిందన్నారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం డిపెండెంట్‌లకు న్యాయం చేయాలని కోరారు. బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడుమ ల్రాజు శ్రీనివాసరావు, ఏరియా కార్యదర్శులు మారిన వెంకటేశ్వర్లు, సంపత్, కేంద్ర కమిటీ సభ్యుడు ఓరం కిరణ్, టీబీజీకేఎస్ ఏరియా అధ్యక్షుడు అంబాల ఓదెలు ఉన్నారు.

కావాలనే తక్కువ చేసి చూపారు

కోటపల్లి, ఫిబ్రవరి 4 : కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన బీసీ కులగణనలో పారదర్శకత లేదు. నామ మాత్రంగానే సర్వే నిర్వహించి బీసీ జనాభాను కావాలనే తక్కువ చేసి చూపారు. బీసీలకు అన్యాయం చేయాలని చూడడం సరికాదు. గతంలో తక్కువ సంఖ్యలో ఉన్న అగ్రవర్ణాల సంఖ్య పెరిగినప్పుడు.. బీసీల సంఖ్య ఎలా తగ్గుతుందో కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలి. ఇప్పటికైనా మరోసారి కుల గణన చేపట్టి బీసీ జనాభాను ప్రకటించాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ స్థానాలు పెంచి బీసీలను రాజకీయంగా ప్రోత్సహించాలి

- బజ్జూరి వెంకటేశ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధికార ప్రతినిధి

బీసీలకు అన్యాయం చేయాలని చూస్తున్నారు

కోటపల్లి, ఫిబ్రవరి 4 : కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కుల గణనలో మొత్తం అసంపూర్తి సమాచారం ఉంది. అగ్ర వర్ణాల కులస్తుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సర్వే చేసినట్లు స్పష్టమవుతుంది. 100 శాతం సర్వే చేయకుండా నామామాత్రంగా సర్వే చేసి పూర్తయ్యిందని చెప్పడం దారుణం. ఈ ప్రభుత్వం అన్యాయం చేయాలని చూస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసి తీరాల్సిందే. ఎమ్మెల్సీ టికెట్లు రెడ్ల కులస్తులకే కేటాయించి బీసీలను పక్కన పెట్టారంటే కాంగ్రెస్‌కు బీసీలపై ఎంత ప్రేమ ఉందో అర్థం చేసుకోవచ్చు.

- కొడిశెట్టి రాజు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకుడు

మళ్లీ సర్వే చేయాలి

చెన్నూర్ రూరల్, ఫిబ్రవరి 4 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణన సర్వే సరిగా చేయలేదు. గతంలో ఉన్న బీసీల సంఖ్య కంటే ఇప్పుడున్న బీసీల సంఖ్య సుమారుగా 5 నుంచి 10 శాతం లోపు పెరగాలి. కానీ. ఈ సర్వేలో 5 శాతం బీసీల సంఖ్య తగ్గింది. మళ్లీ ప్రభుత్వం సక్రమంగా సర్వే చేయాలి. ప్రతీ కులానికి సమన్యాయం చేయాలి. ప్రభుత్వం చేసిన సర్వేను అందరూ తప్పుపడుతున్నారు.

- మాదాసు మధూకర్. మున్నూర్ కాపు సంఘం మాజీ అధ్యక్షుడు. చెన్నూర్



అయ్యో.. ఇవేం కులగణన లెక్కలు

గజి బిజి.. గందరగోళం

తప్పుల తడకగా కులగణన సర్వే లెక్కలు

- ఓ వైపు విమర్శలు వెల్లువెత్తుతుంటే.. దేశానికే దిక్సూచి అంటూ గొప్పలు
- 2014 సమగ్ర సర్వేలో జిల్లాల వివరాలు వెల్లడించిన కేసీఆర్ సర్కారు
- జిల్లా లెక్కలపై ఇప్పటికీ రాని స్పష్టత.. మండిపడుతున్న ఆయా వర్గాల ప్రజలు..
- 2014లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జనాభా 28.24 లక్షలు
- కాంగ్రెస్ లెక్కల ప్రకారం పదేళ్లలో పెరిగిన జిల్లా జనాభా సగటున 2 వేల మందే..!

మంచిర్యాల, ఫిబ్రవరి 4(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ సర్కారు విడుదల చేసిన కులగణన సర్వే లెక్కలపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జనాభా వృద్ధి రేటు లేకపోవడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. కావాలనే సర్కారు బీసీ కులగణన లెక్కలను తక్కువ చేసి చూపించిందనే ఆయా సంఘాల నాయకులు మండిపడుతున్నారు. 2014లో కేసీఆర్ సర్కారు నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో 3.68 కోట్లు ఉన్న జనాభా 2024 రేవంత్ సర్కారు నిర్వహించిన సర్వేలో 3.70 కోట్లు మాత్రమే పెరిగింది. అంటే పదేళ్లలో రాష్ట్రంలో 2 లక్షల జనాభానే పెరిగింది. 2014 సర్వేలో బీసీ జనాభా 1,85,61,856 ఉంటే, ప్రస్తుత ఇంటింటి సర్వేలో 1,64,09,179 మంది బీసీలే ఉన్నారు. అంటే పదేళ్లలో బీసీ జనాభా 21,52,677 మంది తగ్గారు. ఇది ఎలా నమ్మశక్యం అవుతుందంటూ.. కేసీఆర్ చేసిన సర్వేనే సరైందంటూ.. రేవంత్ సర్కారు చేసిన సర్వే సరికాదంటూ బీసీ సంఘాల నాయకులు, లీడర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు ఇలా విమర్శలు వెల్లువెత్తుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ఇది దేశానికే దిక్సూచి వంటి సర్వే అంటూ గొప్పలు చెప్పుకోవడంపై మండిపడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో పదేళ్లలో పెరిగింది 2 వేల మందేనా..

రాష్ట్రంలో మొత్తం ఇంత మంది జనాభా ఉందని, ఇందులో బీసీలు ఇంత, ఎస్సీలు, ఎస్టీల జనాభా ఇంత ఉందని చెప్తున్న సర్కారు.. జిల్లాలవారీగా వివరాలు వెల్లడించలేదు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లానే తీసుకుంటే కేసీఆర్ సర్కారు సర్వే చేసినప్పుడు 2014లో 28,24,953 జనాభా ఉన్నారు. మరి ఇప్పుడు గడిచిన పదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా కేవలం 2 లక్షల జనాభా పెరిగిందని సర్కారు చెప్తున్నది. ఈ లెక్కన గత పదేళ్లలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సగటున 2 వేల జనాభా మాత్రమే పెరిగినట్లు అవుతుంది. ఇది నమ్మ శక్యమైన పెరుగుదలేనా? జిల్లా మొత్తం పదేళ్లలో 2 వేల మందే పుట్టారని చెప్పే లెక్కల్లో నిజమెంతా? ఉమ్మడి జిల్లాలో గడిచిన పదేళ్లలో జననాలు ఏం జరగలేదా? కేవలం 2 వేల మందే పుట్టారా? ఈ లెక్కలను నమ్మేదెలా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

బీసీల ఆశలపై నీళ్లు

రాష్ట్రంలో బీసీ జనాభా 60 శాతం వరకు ఉంటుంది. జనాభా లెక్కలు చూసినా, వృద్ధిరేటు చూసుకున్నా ఈ 60 శాతం అనేది తగ్గేందుకు వీలు లేదన్నది బీసీల వాదన. రాజకీయం, ఆర్థికం, సామాజికంగా అన్ని రకాలుగా జనాభా తమాషాను అనుసరించి తాము ఎదగాలంటే 42 శాతం రిజర్వేషన్లు ఉండాలన్నది బీసీల చిరకాల వాంఛ. కానీ.. తాజాగా కాంగ్రెస్ సర్కారు విడుదల చేసిన గణాంకాలు బీసీల ఆశలపై నీళ్లు చల్లాయిజ వారి భవితవ్యంపై నిప్పులు పోశాయి. రాష్ట్రంలో బీసీ జనాభా 46.25 శాతమే ఉందని, ముస్లింలు మరో 10 శాతం ఉన్నారంటూ రేవంత్ సర్కారు కుండబద్దలు కొట్టడంపై బీసీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పదేళ్ల క్రితం ఉన్న బీసీ లెక్కల్లో 21లక్షల మంది ఎందుకు తగ్గారు? ఇది కావాలని తగ్గించడం కాకపోతే ఇంకేంటని సర్కారును నిలదీస్తున్నారు. బీసీల జనాభా, రిజర్వేషన్ల అంశం తేలకముందే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతున్నారని, బీసీలను మరోసారి మోసం చేస్తున్నారంటూ మండిపడుతున్నారు. మరోసారి సర్వే చేసి బీసీల లెక్కలు తేల్చాలని, అప్పటివరకు రిజర్వేషన్లు ఖరారు చేయవద్దని డిమాండ్ చేస్తున్నారు.

42 శాతం రిజర్వేషన్లు అమలు చేశాకే ఎన్నికలు

సీఎం రేవంత్ రెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన మాట ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు అమలు చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి. లేని పక్షంలో ఆందోళన చేపడుతాం. బీసీ సర్వేలో కూడా బీసీల శాతాన్ని తక్కువగా చూపారు. బీసీలను మోసం చేసేందుకే ప్రభుత్వం కుట్ర పన్నుతున్నది. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలి. బీసీలను మోసం చేస్తే ఉద్యమం తప్పదు.

- అసం రవీందర్, బీసీ సంఘం నాయకుడు, తలమడుగు



రాష్ట్రంలో గత జనాభా లెక్కలు



దుబ్బగూడెంలో పెద్దపులి అలజడి

- అప్రమత్తమైన ఫారెస్ట్, పోలీస్ అధికారులు
- జనావాసాలకు దగ్గరగా సంచరిస్తున్న టైగర్
- కదలికలు పరిశీలిస్తున్న అధికారులకు ఎదురు పడిన వైనం
- బెజ్జూరు నుంచి వచ్చి వారం నుంచి ఇక్కడే మకాం

కాసిపేట, ఫిబ్రవరి 4 : మండలంలోని దుబ్బగూడెం గ్రామ శివారులో పెద్దపులి అలజడితో ఒక్కసారిగా గ్రామస్తులు భయాందోళనలకు గురయ్యారు. నెల క్రితం బెజ్జూరు నుంచి బయలుదేరిన పెద్దపులి(బీ1) అడవుల్లో సంచరిస్తూ వారం క్రితం ఇక్కడికి చేరుకున్నట్లు తెలుస్తున్నది. బుగ్గగూడెం, కన్నాల, పెద్దనపల్లి, దుబ్బగూడెం శివారు ప్రాంతాల్లో మకాం వేసింది. పెద్దపులికి ఎలాంటి హానీ జరగకూడదనే ఉద్దేశంతో ఫారెస్ట్ అధికారులు ఎప్పటికప్పుడు దాని కదలికలను గమనిస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం దుబ్బగూడెం గ్రామానికి దగ్గరగా పెద్దపులి రావడంతో ఒక్కసారిగా ఫారెస్ట్, పోలీస్ అధికారులు అప్రమత్తయ్యారు. వెంటనే గ్రామస్తులకు సమాచారం అందించి ఆ వైపు రాకుండా చర్యలు తీసుకున్నారు. పులి కదలికలను గమనిస్తున్న ఫారెస్ట్ అధికారులకు ఒక్కసారిగా పులి ఎదురు పడింది. వారిని చూసిన పెద్దపులి తన దారిని మార్చుకొని చెట్ల పొదల్లోకి వెళ్లిపోయింది. ఆపై కనిపించకుండా పోయింది. పులి పాదముద్రలను అధికారులు గుర్తించారు. వారం నుంచి ఇక్కడే మకాం వేసింది. మూడు రోజుల క్రితం కన్నాల శివారులో అడవి పందిపై దాడి చేసిన విషయం విదితమే. ఇది దానికి అనువైన ప్రదేశం కాకపోయినప్పటికీ ప్రజల అలజడికి ఎటూ వెళ్లలేక ఇక్కడే ఉండి పోయినట్లు తెలుస్తున్నది. ప్రస్తుతం అది విశ్రాంతి తీసుకుంటుందని, దానికదే తన దారిలో వెళ్లిపోతుందని, ప్రజలు ఇబ్బందులకు గురి చేయవద్దని అధికారులు సూచిస్తున్నారు. ఎఫ్‌డీవో సర్వేశ్వర్, కాసిపేట ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, బెల్లంపల్లి రేంజర్ పూర్ణచందర్, మంచిర్యాల రేంజర్ రత్నాకర్, డిప్యూటీ రేంజర్లు ప్రవీణ్ నాయక్, గౌరి శంకర్, సంతోశ్, సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాస్, బీట్ ఆఫీసర్లు ఉన్నారు.

పెద్దపులి వెళ్లిన దారిలో అడుగులను పరిశీలిస్తున్న అధికారులు

పెద్దపులి పాదముద్రలు

హైదరాబాద్‌లో సమాచార హక్కు చట్టంపై నిర్వహించిన శిక్షణ తరగతుల్లో పాల్గొన్న రిటైర్డ్ కార్మికులు

సమాచార హక్కు చట్టం అమలుకు బాధ్యత వహించాలి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 4 : సమాచార హక్కు చట్టం అమలు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించాలని ఆ చట్టం శిక్షణ తరగతుల కో ఆర్డినేటర్ శ్రీనివాస్ మాధవ్ పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ అభివృద్ధి వనరుల కేంద్రంలో సమాచార హక్కు చట్టంపై నిర్వహించిన శిక్షణ తరగతులకు ఫ్యాకల్టీ ఇన్‌చార్జి సౌమ్యరాణితో కలిసి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ, ఏపీలో సమాచార హక్కు చట్టం సరిగా అమలు చేయడం లేదని, దరఖాస్తుదారులకు సమాచారం ఇవ్వడం లేదన్నారు. ఇకనైనా పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వేణుమాధవ్, నాయకులు రాళ్లబండి రాజన్న, పెద్దపల్లి కోటిలింగం, మేరుగు రాజయ్య పాల్గొన్నారు.